# దృష్టికోణం

వాచి చూసుకున్నాను. రెండుంపావు. కంపార్టుమెంటు గుమ్మం దగ్గర నుంచున్నాను. విజయవాడ దూరం అయిపోతోంది. చీకటి. ఒంగిపోయిన ఆకాశం భూమిని కలిసే దగ్గర మటుక్కు కొంచెం ఎర్రటి వెలుగుంది. మూడు గంటల ప్రాంతంలో ఓ బ్రిడ్జి వస్తుంది. ఆ బ్రిడ్జి కింద నిండిన నీళ్ళతో బరువుగా ప్రవహించే పెద్దవాగుంది. కిందటివారం పడ్డ వర్షాలకి అన్ని వాగులు నిండాయి. అందులో ఇదోటి.

"రంయ్యిమంటూ చలిగాలి కొడ్తోంది. ఆ తలుపెయ్యి" ఎవరో లోపల్నించి గట్టిగా అరిచారు.

తలుపువేసి, దానికే అనుకున్నాను.

కళ్ళు మూసుకున్నాను.

బయటి చీకటి కంటిముందుంది.

ఆ చీకట్లోంచి, నా అసమర్ధత, నా అప్రయోజకత్వం, నిర్వీర్యుడిగా మార్చిన బీదరికం అన్ని బ్రైట్‌గా కనిపిస్తున్నాయి.

'అమ్మా! నన్ను క్షమించు. నాన్నా! నన్ను క్షమించు. మీరు మంచి అమ్మానాన్నలు. కానీ, నేను మంచి కొడుకుని కాను, మీ ధర్మం మీరు నిర్వర్తించి నన్ను పెంచి పెద్దచేసారు. కానీ, చదువుకున్న నేను మీ కొడుకుగానా ధర్మం నేను చెయ్యడంలేదు."

"దేవుడా! మ్మరో జన్మంటూ ఉంటే నాకు శక్తినిచ్చి ఇదే యింట్లో పుట్టించు. వాళ్ల ఋణం తీర్చుకొంటాను" అని కళ్ళు మూసుకున్నాను.

బ్రిడ్జి వచ్చినట్లు శబ్దం వస్తోంది.

జేబును తడిమాను.

చేతికి ఉత్తరం తగిలింది.

"నా ఆత్మహత్యకి ఎవరూ బాధ్యులు కారు. నా తలితండ్రులకి ఇంక బరువు కాదల్చుకోలేక ఈ అడుగు వేసాను" అని ఆ ఉత్తరంలో ఉంది.

కళ్ళల్లో నీళ్ళు తిరిగాయి. నా నిస్సహాయతకి, అసహాయతకి నా మీద నాకే జాలి. అందుకే కన్నీళ్ళు.

మరోసారి దేవుణ్ణి తలుచుకున్నాను.

ధైర్యంగా దూకేసాను.

---

ఏమయిందో తెలియదు, ఎంత సేపో తెలీదు. నొప్పిగా ఉంది...భరించలేని నొప్పి...మెల్లగా, బలవంతంగా కళ్ళు తెరిచాను మళ్ళా మూసుకున్నాను. స్వర్గమా నరకమా? తేల్చుకోలేని స్థితి.

'అమ్మా!' మూలిగాను. ఎక్కడున్నానో! తెలుసుకోడానికి ప్రయత్నిస్తున్నాను.

చాలా సేపటికి, చాలా కష్టంతో కళ్ళు బాగా తెరుచుకున్నాయి.

ఏమిటి? ఎక్కడున్నాను! అర్థం కాని అయోమయ స్థితి! ఆ స్థితినించి రావడానికి చాలా సమయం పట్టింది. ఛావలేదా! నీళ్ళల్లో పడలేదా! అయ్యో! నీళ్ళల్లో పడకుండా పక్కనెక్కడో పడి కాళ్ళు విరక్కొట్టుకున్నానా! ఎవరు తెచ్చి ఉంటారో! ఎన్నో ప్రశ్నలు...మళ్ళామూలిగాను. అసమర్థుడు చావడానకి కూడా పనికిరాడా?

చుట్టూచూసాను. పైన కప్పుకింద నేల, దాన్ని ఆనుకున్న ఆకుపచ్చ పెయింట్ వేసిన గోడలు. నేను కింద పడుక్కుని ఉన్నాననిపించింది.

మళ్ళా మూలిగాను.

'ఎవరూ! చాలా నొప్పిగా ఉండి ఉంటుంది బాగా మూలుగుతున్నారు." మాట ఆగింది. వెంటనే ఆగని దగ్గు. ఆ మాట, దగ్గు ఎక్కణ్నించో తెలీలేదు. కానీ దగ్గర నుంచే. నేను కదలలేని స్థితిలో ఉన్నాను లేచి చూద్దామంటే.

"ఏంటి ఛావబోయారా! ప్చ్! మీ దురదృష్టం మీ వెనక్కాలే...అయినా ఛావడం పిరికివాళ్ళు చేసేపని. మీ వాళ్ళగురించి, మీ బాధ్యతల గురించి మీ ధర్మం గురించి మీకు తెలీదా! చదువుకున్న వాళ్ళల్లాగా ఉన్నారు...ఏం ఉద్యోగం లేదా!...ప్రేమ విఫలం అయిందేమో!...అవునా! అంతేనా!..."అంటూ సిస్టర్ లోపలికొచ్చింది.

నిన్నరాత్రి వరకూ నాలో ఉన్న డిప్రెషన్ యిప్పుడు లేదు. యిప్పుడు నొప్పితో పోరాడుతున్న వీరుణ్ణి. నిన్న నేను వేరు, ఇవాళ్టి నేను వేరు. అగాధాల వ్యత్యాసం.

"సిస్టర్! ఈ కింద పడుక్కోలేను. నాకో మంచం యివ్వండి ప్లీజ్!" అన్నాను బాధగా.

"చూడండి, ఇది చాలా చిన్న ఆసుపత్రి, నాలుగు గదులు కూడా లేవు. మీ ఫ్రాక్చర్‌లు చూసి, మీరు కదలలేని స్థితిలో ఉన్నారు. కాబట్టి యిక్కడ ఉంచారు. లేకపోతే మిమ్మల్ని మీ ఊరు పంపేవారు.

మళ్ళా దగ్గు. అతికష్టం మీద పక్కకి చూసాను. పక్కన ఓ చెక్కస్క్రీన్. దాని వెనక్కాల దగ్గు అతనికి మంచం. నా రూం మేట్ అన్నమాట ఈ దగ్గుమనిషి.

ఈ గదిలో నేను ఈ దగ్గు ఉండాలి. హూఁ...దేవుడు నిర్దయుడు.

కళ్ళు మూతలు పడ్తున్నాయి. మత్తు ఇంజక్షన్ ప్రభావం మొదలయింది. పడుకున్నాను.

'హలో! లేచారా!' ఏదో లోకంలోంచి ఆ మాటలు. చాలా సేపటికి ఈ లోకంలోకి వచ్చాను.

నా ఆలోచనల్లోకి దూరిపోయాడు ఆ దగ్గు. కోపం వచ్చింది. అతని చొరవకి. అమ్మవాళ్ళ గురించిన ఆలోచనలకి దగ్గు అంతరాయం వచ్చాడు.

'నొప్పి తగ్గిందా!'

'లేదు' విసుగ్గా అన్నాను.

"నొప్పి లేకపోతే జీవితంలోని హాయి తెలీదు. అన్నీ రెలెటివ్" నేనేం మాట్లాడలేదు. చలికాలంలో వేడిలో హాయి, మండే వేసవిలో చలిలోని హాయి అప్పుడేగదా తెలుస్తుంది."

ఉదయ రాగంతో కలిసి పాడుతున్న పక్షులగురించి, ఆ పాటల్ని మోసుకొస్తున్న గాలి గురించి మాట్లాడుతున్నాడు. నా జవాబు కోసం చూడడంలేదు.

ఆకాశాన్ని వర్ణించడంలో ఆయనుండిపోయాడు.

'కవిత్వం రాస్తారా!" అన్నాను.

నవ్వాడు...వెంటనే ఓ అయిదు నిమిషాలు దగ్గు.

"స్పందించే హృదయం ఉంటే మాటలు కవిత్వంలా అనిపిస్తుంది."

"బయట వర్షం పడ్తోంది. చల్లటి తేమగాలి ఎంత బావుందో!" హాయిగా ఉంది"

ఒక్కక్షణం నాకు దగ్గుమీద ఈర్ష్య. నాకులేని ఆనందం ఆయనకా! మళ్ళా దేవుణ్ణి తిట్టుకున్నాను.

"కింద ఉన్నారు మీరు మీక్కనపడదు. నేను చెప్తానులెండి. ఎన్ని షేడ్స్‌లో ఆకుపచ్చ ఉంటుందో అన్ని షేడ్స్ కనిపిస్తున్నాయి. గడ్డి, తాటిచెట్లు, మర్రిచెట్లు, ముదురాకులు, లేతాకులు, వాటి పచ్చదనాన్ని తీసుకున్న నీటి చెలమలు, జపాలు చేస్తున్న కొంగలు చెట్లల్లో ఒదిగిపోయిన గువ్వలు –"

'పుస్తకాలు బాగా చదువుతారా!'

"కనిపెట్టారు. అయినా దృష్టి ఉండాలి. అది చూసే కోణం దాన్ని మనం సరిగ్గా గీసుకోగలిగితే చాలు..." నవ్వాడు. మళ్ళా దగ్గు.

నాకా అదృష్టం లేదు. ఎన్ని రోజులు యిలా ఉండాలి? ఈ కదలలేని స్థితి...అసలు చచ్చిపోదామనుకున్న వాణ్ణి...అటు ఛావనూ లేదు ఇటూ బతకనూ లేదు. చచ్చిపోయి ఉంటే బావుండేది.

నా దురదృష్టానికి ఎవర్ని నిందించను?

ఎందుకు ఛావాలనుకున్నాను.

ఉద్యోగం లేదు బరువు బ్రతుకు.

ఎవరూ మాట్లాడుతున్నా నాగురించే నేమో అనిపించేది.

ఎవరూ నవ్వినా నన్ను చూసేనేమో అని అనిపించింది.

యింట్లో ఎవరైనా నా ఉద్యోగం గురించి సలహాలిస్తూంటే చెప్పలేనంత చిరాకు, విసుగు, కోపం, దాంతో వాళ్ళు తిటట్టం, నేను తిట్టడం...

ఆ దగ్గుకి నా కాంప్లెక్స్ అర్థం అయింది.

"చదువొక్కటే' కాదు ఉద్యోగానికి కావాల్సింది ఈ ఐ.టి.యుగంలో మనిషికి తెలివి తేటలు పెట్టుబడి. ఆకర్షణీయమైన జీతాలు, సదుపాయాలు ఉన్నాయి. కష్టపడితే మంచి ప్రతిఫలం. దాదాగిరితో పనిచేయించుకోడం, బాసిజం ఉండదు. నీ వ్యక్తిత్వం నలుగురిలో నీకు మంచే చేయాలి ఐక్యూకాదు, ఈక్యూ ఉండాలి. నీ యింట్లో వాళ్ళతో నీ సంబంధాలు ఎలా ఉన్నాయో ముఖ్యం.

ముఖ్యంగా నీమీద నీకు నమ్మకం ఉండాలి. అది లేకపోతే దానికోసం ప్రయత్నించాలి. ఉద్యోగాలు చాలా ఉన్నాయి. కానీ, ఎంప్లాయిబిలిటి లేకపోవడం వల్లే చాలామందికి ఉద్యోగాలు రావడం లేదు." అదే నీకున్న లోపం సరిచేసుకో. ఏదీ రాకపోతే ఆలోచించు. ఎందుకు రాదు. ప్రయత్నం ఉండాలి. పుస్తకాలు చదువు. వ్యక్తిత్వం పెంచుకో.

దగ్గుమీద సదభిప్రాయం కలిగింది.

నిజమే. నాలోని లోపం నాకు తెలిసింది. నా ఆలోచనా సరళిలో మార్పురావాలి.

"యిలా ఎన్నిరోజులుంటానో నాకు తెలీదు. కానీ ఇది బ్లెసింగ్ ఇన్ డిస్గైస్ అనుకుంటాను. ఎక్కడున్నానో తెలీక యింట్లోవాళ్ళు కంగారు పడ్తూంటారు...నేనెంతస్వార్థపరుణ్ణో నాకిప్పుడు తెలుస్తోంది, చాలా సెల్ఫిష్ని. నా గురించి ఆలోచించలేదు. మా వాళ్ళ గురించి ఆలోచించలేదు.

నవ్వాడు.

ఆ వెంటనే దగ్గు. ఈసారి చాలాసేపే దగ్గాడు.

"మీరు అదృష్టవంతులు. మీకు తోడు ఓ కిటికీ. కిటికీలోంచి అందమైన ఆ దృశ్యాలు. అసలు మన రాతలు ఎలా ఉన్నాయో చూడండి. [illegible]రం ఒకే గదిలో ఉన్నాం. నాకు గోడలు తప్ప మరేం కనపడటం లేదు. మీకు మంచం అపక్కనే కిటికీ..."

మళ్ళా నవ్వాడు. మళ్ళా దగ్గు. ఈసారి కూడా చాలా సేపే దగ్గాడు.

కళ్ళు ఎప్పుడో మూతలు పడ్డాయి.

మర్నాడు లేచేసరికి బాగా పొద్దుపోయింది.

సుప్రభాతం లాటి దగ్గు వినపడలేదు.

పడుక్కుని ఉంటాడు. కిటికి దగ్గర మంచం. చల్లటి గాలి ఒంటిని తాకుతూంటే నిద్ర బాగా పట్టుంది. వీచే ఉదయపుగాలి తెచ్చె పరిమళాల మత్తుకి నిద్రలేచి ఉండడు.

నాకు సపర్యలు చెయ్యడానికి రోజూవచ్చే అబ్బాయి వచ్చాడు.

ఏదో లోటుగా అనిపించినా అవశిష్టాలన్నీ పూర్తి చేసుకున్నాను.

అలవాటుగా వినపడే శబ్దం వినపట్టం లేదు. రెండురోజులుగా బాగా దగ్గరయ్యాడు. ఏదో వెలితిగా ఉంది.

'హలో!'

'... ...'

స్క్రీన్ అవతల నుంచి ఏం వినపడలేదు.

"హలో! యింకా నిద్రలేవలేదా!"

నిశ్శబ్దం.

సమాధానం రాలేదు. సిస్టర్ వచ్చింది.

"మీరు యిచ్చిన అడ్రసుకి ఉత్తరం రాసాము. ఇవ్వాళ వస్తున్నామని ఫోన్ చేసారు. మీ నాన్నగారు."

ఆమె మాటలు వినిపించుకోలేదు.

"సిస్టర్! ఆ స్క్రీన్ అవతలున్న మనిషి లేవలేదా!"

"ఓ, ఆయనా! మీరు నిద్రలో ఉన్నారు. అందుకే మీకు తెలీలేదు. ఆయన రాత్రి ఒంటగంటకి చనిపోయారు. వాళ్ళింటికి తీసుకెళ్ళిపోయారు" నిర్వికారమైన గొంతుతో అంది.

ఇంకా ఏదో చెప్తోంది. ఆమె మాటలు వినపడ్డం మానేసాయి.

చనిపోయాడా!

నిన్నరాత్రి, నేను పడుక్కునే వరకూ, వర్షం నీళ్ళు చేరి ఏర్పడ్డ చిన్నసైజు చెరువుమీద పడ్డ చంద్రుడి ప్రతిబింబం గురించి అంతసేపు మాట్లాడిన మనిషి ఇప్పుడు లేడా! ఇంతేనా జీవితం! ఇంత చిన్నదా! అలాంటి ఈ చిన్న జీవితాన్ని నేను మూడురోజుల క్రితం అంతం చేద్దామనుకున్నానే! ఎంతటి అజ్ఞానం! ఈ అజ్ఞానాన్ని దూరంచేసిన మనిషిలేడు.

ఆ తర్వాత ఏం తోచలేదు.

ఒంటరితనం భయంకరంగా అనిపించింది.

సిస్టర్ ఏదో మందు, ఇంజక్షన్ యివ్వడానికి వస్తే, ఆ మాత్రలచేదులా చేవలేని జీవితంలాగా అనిపించింది ఆయనలేని లోటు.

"సిస్టర్! నాకాయన మంచం యిప్పించండి. కాళ్ళ నొప్పితోపాటూ వీపుకూడా నొప్పిగా ఉంటోంది..." ప్రాధేయపడ్తు అడిగాడు.

అప్పుడే మంచం మీదకి షిఫ్ట్ అయిపోయాను అన్న భావం వచ్చింది.

మంచం మీద తలగడలు ఎత్తుగా ఉంచుకుని 'దగ్గు' చెప్పినట్లు మంచిపుస్తకాలు చదువుతూ, ఎంజాయ్ చేస్తాను.

తొలి వేకువ, ఉలిపొర.వెతురులో ఉదయాన్ని చూడచ్చు.

ప్రకృతిలోని అందాల తెరలన్నీ వేడికి ఎలా చిరిగిపోతాయో చూస్తేనే తెలుస్తుంది అన్నాడు 'దగ్గు' అదీ చూడాలి.

మరోగంటకి కొండంత ఆశతో, ఆత్రుతగా, ఉత్సాహంగా మంచం మీదికి చేరిపోయాను వెంటనే గోడవైపు చూసాను.

షాక్ తిన్నాను. మంచం పక్కగా ఉన్న గోడని చూసి, అక్కడ కిటికీలేదు. మరి యిన్నిరోజులు...టప్పున రెండు బొట్లు రాలాయి.

దగ్గు...వినపడినట్లయింది.

'జీవితం ఎప్పుడు తెల్లగోడలాగే ఉంటుంది. చూసే దృష్టిలో ఉంది. శూన్యంలోంచి వెలుగురేకల్ని అందులోంచి, సప్తవర్ణాల్ని చూడ్డం నేర్చుకోవాలి. అదేకదా జీవితంమీద ఆశపెంచేది' అని అంటున్నట్లుగా అనిపించింది. నేనేం చెయ్యాలో సున్నితంగా, అందంగా చెప్పిన, ఆ చూడని వ్యక్తికి మనసులో నమస్కరించాను.

✧ ఫిబ్రవరి 2005 బాపు మాసపత్రికలో ✧